సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 2 । ఆగస్టు । 2025



హాస్టళ్లలో దయనీయ స్థితిలో విద్యార్థులు

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటూ..దయనీయ స్థితిలో ఉన్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు పేర్కొన్నారు. -8లో



ఘనంగా స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పోలీసు పరెడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని జేసీ ఆదర్శ రాజేంద్రన్ జిల్లా అధికారులను ఆదేశించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.500
రెండోరకం	రూ.200	రూ.370

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 302 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

3న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల3వతేదీ జిల్లా పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక జరగనుంది. ఈ విషయాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9502074146, 88850 22258 నంబర్లలో సంప్రదించాలన్నారు.

3న వెలిగల్లు నుంచి నీటి విడుదల

గాలివీడు: వెలిగల్లు కుడికాలువ గేట్లు ఈనెల 3వ తేదిన ఉదయం 9 గంటలకు ఎత్తి నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు డీఈఈ బి.భాస్కర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతుల విజ్ఞప్తి మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

నియామకం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని ఆ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.తంబళ్లపల్లెకు చెందిన ఆర్‌సీ ఈశ్వర్‌రెడ్డిని స్టేట్ పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా, రాయచోటికి చెందిన వి.వెంకట రమణను స్టేట్ పబ్లిసిటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా, రాజంపేటకు చెందిన మారుతిరావును స్టేట్ సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమించారు.

8న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు వెళ్లే వారి కోసం ఆగస్టు 8న ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వైఎస్సార్ జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 8న సాయంత్రం 4.30 గంటలకు కడప డిపో రాయచోటి, పీలేరు మీదుగా సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. ఇందులో టిక్కెట్ ధర రూ. 1044గా ఉందన్నారు. బద్వేలు డిపో నుంచి ఉదయం 9.00 గంటలకు అల్ట్రా డీలక్స్ బస్సు బయలుదేరుతుందన్నారు. ఇందులో రూ. 1282 ఛార్జిగా నిర్ణయించారన్నారు. మైదుకూరు డిపో నుంచి మధ్యాహ్నం 3 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందని, ఇందులో చార్జి రూ. 1352 అని తెలిపారు. ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు వెళుతుందని, ఇందులో టిక్కెట్ ధర రూ.1273. పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు రాయచోటి, పీలేరు మీదుగా నడుస్తుందన్నారు. ఇందులో చార్జి రూ. 1233గా ఉందన్నారు.

నిషేధ సమయంలో చేపల వేట సాగిస్తే చర్యలు



మత్స్యకారులతో మాట్లాడుతున్న సుబ్బనరసయ్య

సాక్షి ఎఫెక్ట్..

గాలివీడు: జులై, ఆగస్టు మాసాల్లో నిషేధ సమయంలో చేపల వేట కొనసాగిస్తే చర్యలు తప్పవని ఎఫ్‌డీఓ సుబ్బ నరసయ్య మత్స్యకారులను హెచ్చరించారు. 'సాక్షి'లో వెలువడిన కథనంతో జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో హుటాహుటిన మత్స్యశాఖ అధికారులు శుక్రవారం వెలిగల్లు జలాశయాన్ని పరిశీలించారు. మత్స్యకారులు, విక్రయదారులకు హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ చేపలు గుడ్లు పెట్టి పిల్లలుపునరుత్పత్తి చేసే సమయంలో ఎవ్వరూ చేపల వేట సాగించరాదన్నారు. విలేజ్ ఫిషనరీష్ అసిస్టెంట్ రామాంజి నాయక్ పాల్గొన్నారు.

బాబు నోట.. అబద్ధాల మూట!

- నిస్సిగ్గుగా అసత్యాలు వల్లెవేసిన సీఎం చంద్రబాబు
- గండికోటకు రెండు సార్లు శిలాఫలకం వేసి పైసాకూడ నిధులు కేటాయించలేదు
- వైఎస్సార్ హయంలోనే రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం





ప్రజావేదిక కార్యక్రమంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు, ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

జమ్మలమడుగు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ పాతపాటే పాడారు.. ఎప్పట్లాగే అబద్ధాలే వల్లె వేశారు. 'రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తా... జిల్లాను పర్యాటక హబ్‌గా చేస్తా..' అంటూ అవే డాంబికాలు పోయారు. 2014లో మొదలుపెట్టిన రాగాన్నే మళ్లీ సవరించారు. ఇప్పటివరకు రెండుసార్లు సీఎం హోదాలో పని చేసినా ఇంతవరకు రూపాయి విదిల్చింది లేదు. పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందిన దాఖలా అస్సలు లేదు. ప్రపంచ పర్యాటకకేంద్రంగా ఉన్న గండికోటలో హరిత హోటల్ నిర్మాణం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలోనే జరిగింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సరైన మౌళిక సదుపాయాలు సైతం కల్పించలేకపోయారు.

గండికోట ప్రాజెక్టుకు రెండు సార్లు శిలాఫలకం వేసి ఏం చేశారు..

గండికోటప్రాజెక్టు నిర్మాణం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు సార్లు శిలాఫలకం వేశారు. ఏనాడు ప్రాజెక్టు నిర్మాణం కోసం మొగ్గచూపలేదు. 2004లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయిన తర్వాత గండికోట ప్రాజెక్టు నిర్మాణం కోసం శ్రీకారం చుట్టారు. 22 గ్రామాల ప్రజలకు పరిహారం ఇచ్చి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 90 శాతం పనులు నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే పూర్తయ్యాయి. కేవలం పదిశాతం పనులు మాత్రమే చంద్రబాబు పూర్తి చేసి తామే ప్రాజెక్టు పూర్తి చేశామని చెబుతుండటంతో జిల్లావాసులు,నియోజకవర్గంలోని ప్రజలు నవ్వుకుంటున్నారు. అంతేకాకుండా టీడీపీ ప్రభుత్వం రాయలసీమకు సాగు, తాగునీరు అందించేందుకు హంద్రీనీవా- గాలేరు-నగరి ప్రాజెక్టులు శ్రీకారం చుట్టామని చంద్రబాబు చెబుతున్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచి ఏకంగా గాలేరు-నగరి కాలువల్లో 20 వేల క్యూసెక్కులు వరద నీరు ప్రవహించేవిధంగా కాలువలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా అవుకు, లింగాపురం వద్ద కొండలకు టన్నెల్ వేసి నీటిని గండికోట ప్రాజెక్టుకు తరలించేవిధంగా చర్యలుచేపట్టిన ఘనత వైఎస్‌దే అని జిల్లా వాసులకు తెలియందికాదు. అలాంటి ప్రాజెక్టును తామే పూర్తి చేశామని సమావేశంలో చంద్రబాబు మాట్లాడటం విడ్డూరంగా ఉందని నియోజకవర్గవాసులు ఎద్దేవా చేస్తున్నారు. ఇక మైలవరం ప్రాజెక్టు నిర్మాణం సమయంలో కనీసం టీడీపీనే ఆవిర్భవించలేదని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కాసు బ్రహ్మానందరెడ్డి 1974లో 100కోట్ల రూపాయలతో మైలవరం జలాశయం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. దానిని 1983 నాటికిపూర్తి చేస్తే అప్పటి ముఖ్యమంత్రిగా ఎన్‌టీరామారావు ప్రారంభోత్సవం చేశారే తప్ప టీడీపీ చేసిందేమీ లేదు. కాలువల్లో నీరు ప్రవహించడం, చివరి ఆయకట్టురైతుకు మైలవరం జలాశయం నుంచి నీరు అందకపోవడంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మైలవరం ఉత్తర,దక్షిణ కాలువలకు 150 కోట్ల రూపాయలతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఉత్తర కాలువ రత్న కంపెనీ, దక్షిణ కాలువ పనులను సీఎం రమేష్ నాయుడుకు చెందిన రిత్విక్ కంపెనీ చేసింది. ఈ విషయం కూడా చంద్రబాబు తెలియకుండా మైలవరం ప్రాజెక్టు సైతం తామే పూర్తిచేశామని చెప్పుకోవడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిస్థాయిలో టీడీపీ ప్రభుత్వం గాని చంద్రబాబు గాని నిర్మించిన దాఖలాలులేవు. వచ్చిన ప్రతిసారి ఊకదంపుడు ఉపన్యాసాలు తప్పా జిల్లాకు చేసిందేమీలేదని ప్రజలు వాపోతున్నారు. కాగా చంద్రబాబు ప్రసంగిస్తున్నంత సేపు జనాలు విసుగెత్తిపోయి చూస్తూ ఉండిపోతున్నారే తప్ప ఎటువంటి మద్దతు ప్రకటించకపోవడం గమనార్హం. ప్రాజెక్టుల విషయంలో చంద్రబాబు చెప్పిన మాటలన్ని సుద్ద అబద్ధాలే అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్ ప్లాంట్ కోసం..

2019 జనవరి 24న మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన చంద్రబాబు ప్లాంట్ నిర్మాణం కోసం ఒక సెంటు భూమి కూడా కేటాయించలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో సున్నపురాళ్లపల్లె వద్ద 3000 ఎకరాలు వైఎస్సార్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం భూమిని కేటాయించడంతోపాటు 70 కోట్ల రూపాయలతో పనులను కూడా చేపట్టారు. స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన బాధితులకు పట్టాగలిగిన రైతులకు పరిహారం అందించారు. జిందాల్ కంపెనీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ముందుకు తీసుకొని వచ్చారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఆ ప్రాంతంలోనే స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం చర్యలు చేపట్టింది.

బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



రైతుతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రైల్వేకోడూరు అర్బన్: జిల్లాలోని బొప్పాయి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ సభా భవనంలో రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారులు రైతులను మోసం చేస్తున్నట్లు, తూకాల్లో తేడాలు ఉన్నట్లు పలువురు అభిప్రాయం వ్యక్త పరిచారని, దీనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. దళారులు సిండికేట్ అయి ధరలు తగ్గిస్తున్నట్లు గుర్తించామన్నారు. మామిడి మాదిరి బొప్పాయి రైతులకు మోసం జరిగితే దళారులపై చర్యలు తీసుకొంటామని అన్నారు. తూకాల్లో మోసాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌చ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజారిటీతో ఇరగంరెడ్డిని గెలిపించండి



ఓటు వేయాలని ప్రజలను అడుగుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, చిత్రంలో మేయర్ సురేష్‌బాబు, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

ఎమ్మెల్యే ఆకేపాటి, కడప మేయర్ సురేష్ బాబు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు ప్రజలను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని రాచగుడిపల్లి, సీతాపురం, గొల్లపల్లి, రాచపల్లి గ్రామాల్లో జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఉప ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారానికి ఆకేపాటి అమరనాథరెడ్డి, సురేష్ బాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ..సుబ్బారెడ్డిని గెలిపించుకుంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలిచి, ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వస్తారన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి, ఆర్థిక స్థితి గతులను మారుస్తారన్నారు. కడప మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం అయినప్పటి నుంచి ఒంటిమిట్ట జెడ్పీటీసీని వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వారే దక్కించుకుంటున్నారన్నారు. ఈ సారి కూడా ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ని గెలిపించి, ఒంటిమిట్ట చరిత్రను తిరగ రాయాలని ప్రజలను కోరారు. ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ..తాను ఒంటిమిట్ట మండల ప్రజలకు సుపరిచితున్ని అన్నారు. నన్ను గెలిపిస్తే మండల ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుంటానని, వాటిని పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, రాజంపేట నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు కూండ్ల ఓబుల్‌రెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ దున్నూతల లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మేకపాటి నందకిశోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెవెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసుల రెడ్డి, గురుమోహన్‌రాజు, రవిరాజు, నాగార్జున్ రాజు, రవిరెడ్డి, కత్తి శివయ్య పాల్గొన్నారు.

హంద్రీ-నీవా ఈఈ పోస్టుకు పోటాపోటీ

ప్రభుత్వ స్థాయిలో ముగ్గురు డీఈల తీవ్ర ప్రయత్నాలు



మదనపల్లె: హంద్రీ-నీవా రెండో దశ ప్రాజెక్టులో భాగమైన పుంగనూరు ఉపకాలువ (పీబీసీ)లో కాంక్రీట్ లైనింగ్ పనులు జరుగుతుండటంతో ఈ పనులు చూసే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాధ్యతల కోసం ముగ్గురు డీఈఈ (ప్రస్తుతానికి)లు ప్రభుత్వ స్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. సత్యసాయి జిల్లా కదిరి డివిజన్-11 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నీలకంఠారెడ్డి ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ప్రసుతం ఆయన పీబీసీ లైనింగ్ పనుల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్నారు. ఆయన ఉద్యోగ విరమణ అయ్యాక ఆ స్థానంలో పని చేసేందుకు డీఈఈ హోదా కలిగిన ముగ్గురు ఇప్పటికే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇద్దరికి డీఈఈ నుంచి ఈఈ పదోన్నతి లభించే అవకాశం ఉండటంతో పదోన్నతి తర్వాత ఒకరికి అవకాశం దక్కవచ్చు. మరొక డీఈఈ సత్యసాయి జిల్లా కదిరిలో సుదీర్ఘ కాలం పని చేయడంతోపాటు అక్కడి టీడీపీ నేతలతో మంచి సంబంధాలున్న కారణంగా గట్టిగా పోటీ ఇస్తున్నట్టు తెలిసింది. అయితే ఈఈ అర్హత ఉన్న వాళ్లకి మాత్రమే పీబీసీలో విధులు నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలి. అలా కాకుండా ప్రస్తుతం పీబీసీలో జేఈ స్థాయి ఉద్యోగికి డీఈగా అదనపు బాధ్యతలను అప్పగించి అత్యధిక భాగం పర్యవేక్షణ బాధ్యతలను కేటాయించినట్టుగా ఈఈ విషయంలోనూ వ్యవహరిస్తే ఏ స్థాయి ఉద్యోగికైనా అవకాశం ఇచ్చినా ఆశ్చర్యపోవాల్సింది లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో జిల్లాకు చెందిన ఓ టీడీపీ ఎమ్మెల్యే ఈ విషయంలో జోక్యం చేసుకునేలా కనిపిస్తోంది. హంద్రీ-నీవాలో ఇప్పటికి మంజూరు కాని పనులను..ఈ పనులకు సంబంధం లేని ప్రాజెక్టు డివిజన్‌కు తిరుపతి సీఈ కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇది ఓ టీడీపీ ఎమ్మెల్యే ఒత్తిడి వల్ల జరిగిందని తెలుస్తోంది. ఇలా ఇష్టారీతిన సాగుతున్న నిర్ణయాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే ఈఈ బాధ్యతల అప్పగింతలో విచిత్రాలు జరిగినా ఆశ్చర్యం లేదు. ఇలా ఉండగా ఇప్పటికే ఈఈగా బాధ్యతలు చూస్తున్న ఓ అధికారి..నీలకంఠారెడ్డి ఉద్యోగ విరమణ చేశాక ఆయన బాధ్యతల పరిధిని కూడా తనకే అప్పగించేలా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనితో రూ.366 కోట్ల వ్యయంతో జరుగుతున్న పీబీసీ లైనింగ్ పనుల్లో ఈఈ బాధ్యతల కోసం పోటీ తీవ్రంగా ఉంది. ప్రభుత్వం ఎవరి వైపు మొగ్గ చూపుతుందో వేచి చూడాలి.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2025కు జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం శుక్రవారం పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుండి ఉత్తర్వులు అందాయన్నారు. 3 రకాలుగా ఉపాధ్యాయులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. సెల్ఫ్ నామినేషన్ - ఈచ్ కేటగిరీ ఒన్, రికమెండెడ్ బై 05 ఫెలో టీచర్, పర్‌ఫార్మెన్స్ బేస్డ్ అవార్డ్ త్రూ లీప్ అప్ అని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈ నెల 8వ తేదీలోగా ఆయా డివిజన్ ఉప విద్యాశాఖాధికారుల కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశించినట్లు డీఈఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రైవేట్ యాజమాన్యాలు తప్ప అన్ని యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అర్హులన్నారు. కనీసం పది సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. .

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహాస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్వాతి నక్షత్రంతో పాటు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ వారి ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలో స్వామివారి కల్యాణమండపం వద్ద చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు జరిపారు. ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు.

క్లుప్తంగా

ల్యాండ్రీ షాపులో అగ్ని ప్రమాదం



ల్యాండ్రీ షాపులో చెలరేగుతున్న మంటలు

పీలేరు రూరల్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ల్యాండ్రీ షాపులో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. స్థానిక జెండామాను వద్ద శ్రీనివాసులు ల్యాండ్రీ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షాపులో మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే బట్టలు దగ్ధమయ్యాయి.

జూనియర్ లైన్‌మ్యాన్ అదృశ్యం



రవి నాయక్ (ఫైల్)

గాలివీడు : తూముకుంట గ్రామం ప్రకాష్ నగర్ కాలనీకి చెందిన మూడే బద్దె నాయక్ కుమారుడు, జూనియర్ లైన్‌మ్యాన్ రవి నాయక్(25) కనిపించకపోవడంపై కేసు నమోదు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన రవి నాయక్ ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. ఈయన కడప సీకే దిన్నె మండలంలో జూనియర్ లైన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. మీటరు దారుల వద్ద కరెంటు బిల్లుల రూపంలో దాదాపు రూ.3 లక్షల వరకూ అప్పులు చేసి అవి చెల్లించలేక వెళ్లిపోయినట్లుగా తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

నిమ్మనపల్లె : బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం నిమ్మనపల్లెలో జరిగింది. నిమ్మనపల్లె దిగువ వీధికి చెందిన స్వర్ణ సింగ్ (40) వ్యక్తిగత పనులపై ముష్టూరు పంచాయతీ దిగువపల్లెకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. నిమ్మనపల్లెలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

భార్యపై కరెంట్ వైర్లతో దాడి

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో సప్తగిరి అనే వ్యక్తి తన భార్యపై కరెంట్ వైర్లతో దాడి చేసిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రకాష్ నగర్ కు చెందిన సప్తగిరికి 5 సంవత్సరాల క్రితం వైష్ణవితో వివాహమైంది. భార్యను తరచు వేధించేవాడు. అయితే కరెంటు వైర్లతో గురువారం ఇష్టానుసారంగా చితక బాదడంతో తీవ్ర గాయాల పాలైంది. వైష్ణవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యాపారి ఆత్మహత్య

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె సమీపంలో ఉన్న ఎర్రబల్లె తండాలో నివాసముంటున్న ఆంజనేయ నాయక్(42) అనే అరటి కాయల వ్యాపారస్తుడు గడ్డి నివారణ మందు సేవించి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంజనేయ నాయక్ అరటి కాయల వ్యాపారం చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పులివెందుల ప్రాంతంలోని అరటికాయలను ఢిల్లీ వ్యాపారస్తులకు ఎగుమతి చేసేవాడు. ఈ నేపథ్యంలో ఢిల్లీ వ్యాపారస్తులు సుమారు లక్షలాది రూపాయల డబ్బులు పంపించకపోవడంతో ఆంజనేయ నాయక్ పులివెందుల ప్రాంతంలోని రైతులకు చెప్పుకోలేక గడ్డి మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

దయనీయ స్థితిలో హాస్టల్ విద్యార్థులు

- ప్రభుత్వ వసతి గృహాలను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం
- సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ ఎదుట వైఎస్‌ఆర్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుల నిరసన



కలెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి విభాగం నాయకులు

రాయచోటి : ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటూ.. దయనీయ స్థితిలో ఉన్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో నెలకొన్న పారిశుద్ధ్య, ఆరోగ్య సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం వారు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నాలుగు రోజులుగా సంక్షేమ హాస్టళ్లబాట పేరుతో జిల్లా వ్యాప్తంగా అనేక వసతి గృహాలను వారు పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయన నివేదికను జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌కు అందజేశారు. అనంతరం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు జంగంరెడ్డి కిషోర్ దాస్ మాట్లాడుతూ జిల్లాలోని చాలా హాస్టళ్లలో పారిశుద్ధ్య పరిస్థితులు అత్యంత దిగజారిన స్థితిలో ఉన్నాయన్నారు. తాగునీటి సమస్యలు, నేలపై నిద్రించాల్సిన పరిస్థితులు, దోమల దాడులతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికీ చాలా హాస్టళ్లలో దుప్పట్లు, దోమతెరలు పంపిణీ కాలేదన్నారు. మరుగుదొడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. తలుపులు లేని మరుగుదొడ్లతో విద్యార్థినులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ విద్యార్థుల విద్యాభ్యాసంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. వీటితోపాటు నిధుల కొరత కారణంగా మెనూ అమలు కావడం లేదన్నారు. పురుగులున్న బియ్యంతో వండిన అన్నం, కుళ్లిన కూరగాయలతో తయారు చేసిన కూరలు విద్యార్థుల ఆరోగ్యానికి హాని చేస్తున్నట్లు తెలిపారు. ఫలితంగా ఆహారం తిన్న విద్యార్థులు తరచూ విషజ్వరాలు, వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. అంతేకాక కాస్మోటిక్స్ చార్జీలు అందకపోవడం వల్ల వ్యక్తిగత పరిశుభ్రత కూడా ప్రశ్నార్థకమవుతోందని మథనపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యానికి విద్యార్థుల ఆరోగ్యం బలవుతున్న నేపథ్యంలో విద్యార్థి విభాగం ఈ ప్రధాన డిమాండ్లపై కలెక్టర్‌కు వినతి పత్రంగా సమర్పించింది.

ప్రధాన డిమాండ్లు..

మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలి, శిథిలావస్థకు చేరిన హాస్టళ్లల్లో మరమ్మతులకు నిధులు కేటాయించాలని, గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, హాస్టల్ వార్డన్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, జిల్లావిద్యాశాఖాధికారులు వారానికి ఒకరోజు హాస్టళ్లలో బస చేయాలని, పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని, ప్రతి నెల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు వసంతం మణికంఠరెడ్డి, రాజంపేట నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు అబ్దుల్ ఖాన్, పీలేరు అధ్యక్షులు లోకనాథం, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, రాష్ట్ర కార్యదర్శి హేమంత్, బీసీ విభాగం నాయకులు శివకుమార్, బాబు గౌడ్, రాయచోటి పట్టణ అధ్యక్షులు ఫయాజ్, జిల్లా కార్యదర్శులు అంజాద్ బాష, శివకుమార్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన కేసులో జైలు

కడప అర్బన్ : సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో కులం పేరుతో ఓ మహిళను, ఆమె భర్తను దూషించిన కేసులో నిందితుడైన వెలుగోటి రామలింగేశ్వరరెడ్డికి 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కడప నాలుగవ అదనపు జిల్లా కోర్ట్ న్యాయమూర్తి జి.దీనాబాబు శుక్రవారం తీర్పు ఇచ్చారు. 2018 మే నెల 4వ తేదీన వెలుగోటి రామలింగేశ్వరరెడ్డి, ఫిర్యాది చింతలపల్లి అంకాలమ్మకు చెందిన పొలంలో అక్రమంగా ప్రవేశించి గుంతలు తీసినట్లు, ఆ విషయం తెలుసుకొని ఆమె అతని ఇంటి వద్దకు పోయి ఎందుకు తమ పట్టా పొలంలో గుంతలు తీశారని అడిగారు. అంకాలమ్మ మీ పైన మేము కేసు పెడతాము అని చెప్పగా, దానికి రామలింగేశ్వరరెడ్డి కోపంతో ఆమెను, ఆమె భర్తను కులం పేరుతో దూషించినట్లు, కేసు కాకపోతే ఏమైనా పెట్టుకోమని బెదిరించినట్లు, పొలం పాడు చేసి, గుంతలు చేసినట్లు 2018 జూన్ 28న తేదీన సింహాద్రిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సింహాద్రిపురం పోలీసు వారు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. శుక్రవారం సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడురుకు చెందిన వెలుగోటి రామలింగేశ్వరరెడ్డి(59) పైన కోర్టులో విచారణ చేయగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి దీనాబాబు మూడు సంవత్సరముల జైలు శిక్ష, 10 వేల రూపాయల జరిమానా విధించారు.

చెరువుకుంట కబ్జాకు యత్నం



జేసీబీ యంత్రంతో చదును చేసిన చెరువుకుంట

సుండుపల్లె : మండల పరిధిలోని మడితాడు గ్రామ పంచాయతీ జికె రాచపల్లి గ్రామ పొలంలో సర్వే నెంబర్ 992లో 3.60 సెంట్లు భూమి చెరువుకుంట ఉంది. ఇది రాయచోటి ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో మండలానికి చెందిన టీడీపీ పార్టీకి చెందిన నాయకుడి ఓ కన్ను పడింది. దీనిని ఆక్రమించడానికి జేసీబీతో చదును చేశాడు. అంతేకాకుండా సర్వే నెంబర్ 991/ఏలో 0.7 సెంట్ల భూమి పట్టా ఉందని, పక్క భూమి సర్వే నెంబర్ వేసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, కుంట సర్వే నెంబర్లో ఉన్న భూమిని కబ్జా చేసేందుకు చదును చేశాడని శేఖర్‌రెడ్డి అనే వ్యక్తి గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అదేకాకుండా సర్వే నెంబర్ 994/ఏలో 0.4 సెంట్లు ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేశారని, ఇంకా మరికొన్ని చోట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి దొంగ డాక్యుమెంట్లు సృష్టించినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులో తెలిపారు. కబ్జాదారుల నుంచిప్రభుత్వ భూములను కాపాడాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు గండిలో రెండో శ్రావణ శనివారోత్సవం



విద్యుద్దీపాల వెలుగులో గండి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో నేడు రెండో శ్రావణ మాస శనివారోత్సవం జరుగనుంది. గత వారం కంటే ఈవారం భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉంటాయని భావించిన ఆలయ వర్గాలు అందుకు సరిపడ ఏర్పాట్లు చేశారు. గత వారంలో తలెత్తిన చిన్నచిన్న లోపాలను సరిదిద్ది ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేశామని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. భక్తుల అంచనాల మేరకు లడ్డూ, పులిహోర ప్రసాదాలను సిద్ధం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఉదయం 3గంటలకు సుప్రభాతసేవ, ఉత్సవమూర్తులకు అభిషేకం (ఏకాంతంగా), అలంకరణ, ఆరాధన, 5 గంటలకు మహామంగళ హారతి, అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం ఉంటుందని ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు. అలాగే రాత్రి బస చేయు భక్తుల కాలక్షేప నిమిత్తం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు, అధికారులు సహకరించాలని చైర్మన్ కోరారు.

పరిస్థితిని బట్టి ట్రాఫిక్ ఆంక్షలు

శ్రావణ మాస ఉత్సవాల రెండవ శనివారం భక్తుల రద్దీని బట్టి ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్సై రంగారావులు తెలిపారు. పరిస్థితిని బట్టి లారీలు, టిప్పర్లు తదితర వాటిని వేంపల్లె వైపు నుంచి వచ్చే వాటిని ఇడుపులపాయ క్రాస్ వద్ద, రాయచోటి వైపు నుంచి వచ్చే వాటిని అద్దాలమర్రి క్రాస్ వద్ద ఆపేస్తామన్నారు. బస్సులు, కార్లు తదితరాలను భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని తదుపరి చర్య తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంగా పులివెందుల డీఎస్పీ, సీఐలు, ఎస్సైలతో పాటు సుమారు 130 మంది వరకు సిబ్బందితో బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

రక్త దానం చేసి అపాయంలో ఉన్న ఇతరుల ప్రాణాలను కాపాడాలని ట్రిపుల్ ఐటీకి చెందిన ప్రసాద్ తెలిపారు. గండిలో రక్తదాన శిబిరం కడప రిమ్స్ వారి సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు



మోటారు సైకిళ్లు, నిందితుడితో ఎస్‌డీపీఓ క్రిష్ణమోహన్, రూరల్ సీఐ వరప్రసాద్

చిన్నమండెం : పలు ప్రాంతాలలో పలు మోటారు సైకిళ్లను దొంగతనానికి పాల్పడ్డ దొంగను అరెస్టు చేసినట్లు రాయచోటి ఎస్‌డీపీఓ క్రిష్ణమోహన్, రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌లో నిందితుడితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. చిన్నమండెం ఎస్ఐ సుధాకర్, సిబ్బందితో కలిసి మోటారు సైకిళ్ల చోరీలపై నిఘా ఉంచామన్నారు. చిన్నమండెం, కలకడ, రాయచోటిలలో చోరీకి అయిన కొన్ని మోటారుసైకిళ్లను రికవరీ చేయడం జరిగిందన్నారు. నిందితుడు రాయచోటిలోని ఏజీ గార్డెన్‌కు చెందిన సద్దాం కాగా రాయచోటిలోని రాజులకాలనీలో ప్రస్తుతం నివాసం ఉంటున్నాడన్నారు. జూలై 31న చిన్నమండెం మండలం తూర్పుపల్లె క్రాస్ రోడ్డు వద్ద తమ సిబ్బంది వాహనాల తనిఖీలు చేస్తుండగా.. అతన్ని పట్టుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద ఐదు మోటారు సైకిళ్లను రికవరీ చేయగా, వాటి విలువ రూ.8.85 లక్షలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నమండెం ఎస్ఐ సుధాకర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి



యువకుడిని టాక్టర్‌కు కట్టేసిన గ్రామస్తులు

సింహాద్రిపురం : ఓ దొంగను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సింహాద్రిపురం మండలంలోని సుంకేసుల గ్రామంలో కాకర్ల భాస్కర్‌రెడ్డి భార్య తన ఇంటి వద్ద శుక్రవారం కల్లాపు చల్లుతూ ఉండగా.. బైకుపై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. బైకుపైనే ఒకరు ఉండి మరొకరు ఆమె వద్దకు వచ్చి వివరాలు అడిగేటట్టు అడిగి.. మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లి బైకుపై వెళ్లిపోయారని బాధితురాలు పూర్ణ విలపించింది. అలాగే అంకాలమ్మ గూడూరులో గ్రామానికి చెందిన చిన్నిరెడ్డి తన తోట వద్ద ట్రాక్టర్ ఆపి పనులు చేసుకుంటూ నిమగ్నమై ఉండగా, దొంగ ట్రాక్టర్‌కు ఉన్న బీగం గమనించి స్టార్ట్ చేసుకుని వెళ్లిపోయాడు. రైతు ట్రాక్టర్ శబ్దాన్ని గమనించి బయటికి వచ్చి చూసేసరికి ట్రాక్టర్ చాలా దూరం వెళ్లిపోయింది. దీనితో బాధిత రైతు వెంటనే గ్రామస్తులకు ఫోన్ చేయడంతో వారు ఆ ట్రాక్టర్‌ను వెంబడించి దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి ట్రాక్టర్‌కు తాడుతో కట్టారు. గ్రామస్తులు దొంగను పట్టుకొని దబాయించగా పొంతన లేని సమాధానాలు చెబుతుంటే.. పోలీసులకు సమాచారమిచ్చి పోలీసులకు అప్పగించారు. అయితే ఆ దొంగ నా పేరు సురేష్, నాది అనంతపురం జిల్లా బత్తలపల్లి సమీపంలోని డి.చెర్లోపల్లె గ్రామం అని చెప్పారు.

వచ్చారు.. వెళ్లారు..!

- సెల్‌ఫోన్‌ల వ్యవహారంలో నామమాత్రం విచారణ
- ఏడుగురిపై సస్పెన్షన్ వేటు వేసి 'మమ' అనిపించిన అధికారులు
- తనిఖీలలో దొరికిన 'గుట్కా–హాన్స్' ప్యాకెట్
- క్షుణ్ణంగా తనిఖీ చేస్తే బయటపడనున్న సెల్‌ఫోన్‌లు



కడప కేంద్ర కారాగారం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కడప కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్‌ల వ్యవహారం మరింతగా కొనసాగుతూనే వుంది. దీనికి కారణం అధికారుల 'నామమాత్రపు విచారణ' అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కడప కేంద్ర కారాగారంలో దశల వారీగా నిర్వహించిన తనిఖీలలో పీడియాక్ట్ రిమాండ్ ఖైదీ జాకీర్ వద్దనే 12 సెల్‌ఫోన్‌లు, ఛార్జర్ దొరికాయి. ఆయా తనిఖీలలో దొరికిన సమయాలలో విధుల్లో వున్న వారిని బలిపశువులుగా మార్చి ఏకంగా ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్‌లు, ఇద్దరు జైలర్లు, ముగ్గురు వార్డర్‌లను మొత్తం ఏడుగురిని సస్పెన్షన్ చేసి అధికారులు 'మమ' అనిపించారు. తరువాత ప్రతిరోజూ పత్రికల్లో కడప కేంద్ర కారాగారంలో అవినీతిపై కథనాలు ప్రచురితం కావడంతో.. జైళ్లశాఖ డీజీ అంజనీకుమార్ జూలై 29న కడప కేంద్ర కారాగారంలో పర్యటించారు. అంతకుముందు రాజమహేంద్రవరం డీఐజీ ఎం.ఆర్ రవికిరణ్‌ను ప్రాథమిక విచారణ అధికారిగా పంపడంతో.. ఆయన నివేదిక మేరకు పై ఏడుగురిని సస్పెన్షన్ చేశారు. సెల్‌ఫోన్‌లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రాథమికంగా ఆరా తీసి బయటనుంచి పడేస్తున్నారని విచారణలో తేలిందని తెలియజేశారు. డీజీ అంజనీకుమార్ పర్యటనలో భవిష్యత్తులో నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరూ ప్రవర్తించరని 'ప్రామిస్' చేశారని కూడా 'మీడియా'కు బలంగా చెప్పి వెళ్లారు. కానీ రెండు రోజుల్లోనే తనిఖీలలో బయట నుంచి విధులకు వస్తున్న ఓ గైడ్ టీచర్ వద్ద 'గుట్కా–హాన్స్' ప్యాకెట్ దొరకడం ఎంత వరకు సమంజసం? అలాగే కడపలో ఓ యువకుడి హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తు తన అవసరం కోసం సెల్‌ఫోన్‌ను వేల రూపాయలను ఖర్చు చేసి రహస్యంగా తెప్పించుకున్నాడు. ఆ సెల్‌ఫోన్‌ను కడప కేంద్ర కారాగారంలోనే భూమిలో దాచిపెట్టినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే కారాగారంలోకి 'సెల్‌ఫోన్ సరఫరా' ఆపలేరని స్పష్టంగా తెలుస్తోంది. సెల్‌ఫోన్‌లను రహస్యంగా ఎవరు తెస్తున్నారు? ఎలా తెస్తున్నారు? అనే విషయాలపై అధికారులు సమగ్రంగా విచారణ చేయాల్సి వుంది. ఇందుకోసం పోలీసుల సహాయం తీసుకుని 'డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ వారు ఉపయోగించే మెటల్ డిటెక్టర్‌ల సహాయంతో.. కడప కేంద్ర కారాగారాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తే మరిన్ని సెల్‌ఫోన్‌లు, ఇతరత్రా సామగ్రి బయటపడే అవకాశాలు ఉన్నాయి. పీడియాక్ట్ రిమాండ్ ఖైదీ జాకీర్ ప్రధాన గేటు వద్దకు వచ్చి తాను 12 సెల్‌ఫోన్‌లు కాదు! ఇంకా సెల్‌ఫోన్‌లను తెప్పించుకుంటానని సవాలు విసిరిన వైనం పై కూడా.. ఎక్కడి నుంచి సెల్‌ఫోన్‌లను తెప్పిస్తున్నాడో పోలీసుల ద్వారా నైనా విచారణ చేయించి నిజానిజాలను తెలుసుకుని 'సెల్‌ఫోన్'ల సరఫరాను కట్టడి చేయాల్సిన బాధ్యత అధికారులపై వుంది. జాకీర్ బంధువులు తమకు సహాయపడే ఓ డిప్యూటీ జైలర్ అనంతపురం 'పీఓఏ'లో విధులను నిర్వహిస్తున్నాడనీ తెలుసుకుని అక్కడికే వెళ్లి, తమకు అనుకూలంగా మాట్లాడుకుని వస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సెల్‌ఫోన్‌లను అమ్ముతున్న, సరఫరా చేస్తున్న వారిని పట్టుకుని, తనిఖీల సమయంలో విధుల్లో వున్న, తమకు సంబంధం లేని అధికారులపై చర్యలను మానుకుని, అసలైన దోషులపై చట్టపరంగా చర్యలను తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

'స్వాతంత్య్ర' వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి : భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను జిల్లా పోలీసు పరెడ్ గ్రౌండ్‌లో కనుల పండువగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. కేటాయించిన విధులు పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. అలాగే ఆయా శాఖల ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటాద్రి, డీఆర్‌ఓ మధుసూదన్ రావు, ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఒకరి నగలు మరొకరికి అప్పగింత

కెనరా బ్యాంక్‌లో ఘటన



బ్యాంకు ఎదుట మాట్లాడుతున్న నసీం

రాజంపేట : ఒకరినగలు మరొకరికి ఇచ్చేసిన సంఘటన రాజంపేట మెయిన్ రోడ్డులోని కెనరా బ్యాంక్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజంపేట పట్టణంలోని మన్నూరుకు చెందిన షేక్ నసీం జీవనోపాధి కోసం కువైట్‌లో ఉంటోంది. యేడాది క్రితం 50 గ్రాముల బంగారు నగలు కెనరాబ్యాంక్‌లో పెట్టి రుణం తీసుకున్నారు. కువైట్‌కు తనతో పాటు పాసుబుక్, రుణం రసీదు తీసుకెళ్లింది. మూడు రోజుల క్రితం స్వదేశం వచ్చింది. గోల్డ్‌లోన్ రెన్యూవల్ చేసుకుందామని బ్యాంక్‌కు వెళ్లింది. ఆమెకు కెనరా బ్యాంక్ సిబ్బంది షాక్ ఇచ్చారు. నగలు లేవని సమాచారం ఆమెను ఆందోళనకు గురి చేసింది. తాను నగలు తనఖా పెట్టి వెళితే తనకు తెలియకుండా ఎవరు తీసుకెళ్లారని బ్యాంక్ మేనేజర్‌ను నిలదీసింది. బాధితురాలి తల్లి, కూతురు నగలను విడిపించుకెళ్లినట్లు సమాచారం ఇచ్చారు. ఈ వ్యవహారంపై కెనరాబ్యాంక్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని పట్టణ పోలీసులు బాధితురాలికి సలహా ఇచ్చారు.

బురఖా వేసుకొని మోసం చేశారు..

బ్యాంకులో షేక్ నసీం గోల్డ్‌లోన్‌కు సంబంధించి ఒకరి నగలు మరొకరికి ఇచ్చిన వ్యవహారంపై మేనేజర్ మానిస్ 'సాక్షి'తో మాట్లాడుతూ బురఖా వేసుకొని నసీం తల్లి, కూతురు నగలను తీసుకెళ్లారని చెప్పుకొచ్చారు. గోల్డ్ రిలీజ్ ప్రాసెస్ నసీం చేసినట్లుగా జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై పోలీసులు కూడా సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో తిరుపతికి చెందిన కెనరాబ్యాంకు ఉన్నతాధికారిణి ఒకరు జోక్యం చేసుకున్నట్లుగా తెలుస్తోంది.